

కంఠాత్మకూరులో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

## చల్లా గెలవాలని ప్రత్యేక పూజలు

నడికూడ, నవంబర్ 4: పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి రాబోయే ఎన్నికల్లో లక్ష మెజార్టీతో గెలుపొందాలని కంఠాత్మకూరు గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. బైక్‌లపై ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ రేకుల సతీశ్, పార్టీ ఇన్‌చార్జి గోల్కొండ సదానందం, గుడికందుల శివ, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, బూత్ కమిటీ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'పూటకో పార్టీ మార్చే 'రేవూరి'ని నమ్మవద్దు'

గీసుగొండ, నవంబర్ 4 : పూటకో పార్టీ మార్చే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, అభివృద్ధికి మారు పేరు అయిన చల్లా ధర్మారెడ్డిని గెలిపించుకోవాలని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శిరిశే శ్రీకాంత్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నర్సంపేటలో నమ్ముకున్న కార్యకర్తలను మోసం చేసి వరంగల్ పశ్చిమకు వెళ్లి, గత ఎన్నికల్లో అక్కడ పోటీ చేసి ఓడిపోయి, అక్కడున్న కార్యకర్తల నమ్మకాన్ని వమ్ముచేసి, ఇప్పుడు పరకాలకు వచ్చాడని అన్నారు. ఆయనను నమ్మి మళ్లీ ఇక్కడి వారు కూడా మోసపోవడం ఖాయమన్నారు. ప్రజలు, కార్యకర్తలు ఆలోచించాలని కోరారు. రాజకీయాల కోసమే రేవూరి ఇక్కడికి వచ్చాడని, ప్రజాసేవ చేయడం కోసం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులే అతడు టిక్కెట్ కొనుక్కొని వచ్చాడని, ఇక్కడ ఓడిస్తామని బహిరంగంగా విమర్శలు చేస్తున్నారన్నారు. పరకాల అభివృద్ధి చల్లా ధర్మారెడ్డితోనే సాధ్యమవుతుందని ఆయన తెలిపారు.

## ప్రశాంతంగా ప్రచారం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీసీపీ రవీందర్

ఆత్మకూరు, నవంబర్ 4 : గ్రామాల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రశాంతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించుకోవాలని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ సూచించారు. శనివారం రాత్రి మండలంలోని అక్కంపేట గ్రామంలో సీఐ రవి రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన అన్ని రాజకీయపార్టీల సమావేశంలో ముఖ్య అతిథిగా డీసీపీ రవీందర్ పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు వినియోగం బాధ్యత అన్ని పార్టీల నాయకులపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో పోలీసులకు అందరూ సహకరించాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1950కు ఫోన్ చేయాలన్నారు. గొడవలు సృష్టించి, లా అండ్ ఆర్డర్ ఉల్లఘన పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆత్మకూరు మండలంలోని సమస్మాత్మక గ్రామాలను గుర్తించామని, వాటిపై ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురిచేసినా కేసు నమోదు చేస్తామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని పార్టీల నాయకులు సహకరించాలని ఏసీపీ కిశోర్‌కుమార్ కోరారు. సమావేశంలో ఎస్సై ప్రసాద్, పోలీస్ సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



నర్సక్కపల్లిలో మృతుడి అంత్యక్రియల్లో పాల్గొన్న నాగుర్ల వెంకన్న

## బాధిత కుటుంబానికి నాగుర్ల పరామర్శ

నడికూడ, నవంబర్ 4 : మండలంలోని నర్సక్కపల్లి గ్రామంలో తాళ్లపల్లి రవి గౌడ్ గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వరరావు శనివారం పరామర్శించారు. అంత్యక్రియల్లో పాల్గొని బాధితులను ఓదార్చారు. ఆయన వెంట సర్పంచ్ తిప్పర్తి సాంబశివారెడ్డి, ఉప సర్పంచ్ నాగుర్ల ధర్మారావు, రైతు సంఘం నాయకులు వరికెల కిషన్‌రావు, సూరవు రాజయ్య, శివ రావు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చల్లా రికార్డు గెలుపు ఖాయం

**మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితా రామకృష్ణ**



పరకాలలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితా రామకృష్ణ

పరకాల, నవంబర్ 4 : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో చల్లా ధర్మారెడ్డి నియోజకవర్గంలో మూడోసారి గెలిచి రికార్డు సాధిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితా రామకృష్ణ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గెలుపు కోసం కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 20వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, పారదర్శకంగా అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పాలనలో పరకాల ప్రాంతం గణనీయమైన అభివృద్ధిని సాధించిందన్నారు. ఉమ్మడి పాలకుల హయాంలో తరలివెళ్లిన రెవెన్యూ డివిజన్‌ను తిరిగి తీసుకొచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. సెంట్రల్ లైటింగ్, ప్రతి వాడలో అంతర్గత రోడ్లు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ రక్షిత మంచినీటిని సరఫరా, వంద పడకల దవాఖాన నిర్మాణం బీఆర్ఎస్ పాలనలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రత్యేక చొరవతో చేపట్టినట్లు తెలిపారు. పదేండ్లలో పరకాల రూపురేఖలు మారాయన్నారు. ప్రజలను విపక్షాలు మోసం చేసేందుకు అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. పట్టణ ప్రజలు వారి మాటలు నమ్మొద్దని, వారిని నమ్మి ఓటేస్తే నట్టేట్ట మునుగుతామని హెచ్చరించారు. అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే చల్లాకు మరోసారి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి మద్దతు పలుకుతున్న మున్నూరు కాపులు

## ఎమ్మెల్యే చల్లాకే మున్నూరు కాపుల మద్దతు

**పసరగొండలో ఏకగ్రీవ తీర్మానం**

దామెర, నవంబర్ 4 : గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, ప్రజలకు అండగా నిలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి దామెర మండలంలోని 14 గ్రామాలకు చెందిన మున్నూరు కాపులు సంపూర్ణ మద్దతు పలుకుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. శనివారం మండలంలోని పసరగొండలో అన్ని గ్రామాలకు చెందిన మున్నూరు కాపు కులస్తులు సర్పంచ్ మేడిపల్లి సాంబయ్య అధ్యక్షతన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ మున్నూరు కాపుల కష్టసుఖాల్లో భాగస్వామ్యమై అండగా నిలిచిన ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీ గెలిపిస్తామన్నారు. కొత్తగా వచ్చిన బీజేపీ అభ్యర్థి డాక్టర్ కాళీప్రసాద్ మున్నూరుకాపైనా ఏనాడు కులస్తుల కోసం పని చేయలేదన్నారు. ఇన్నేళ్లు తమకు వెన్నుదన్నుగా ఉండి సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. పరకాల గడ్డపై గులాబీ జెండా ఎగురడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి భారీ మెజార్టీ వచ్చేలా సైనికుల్లా పని చేస్తామన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలకు చెందిన మున్నూరుకాపులు ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో మున్నూరు కాపు నాయకులు మెంతుల రాజు, ఉప్పుల సత్యం, కొసనం సత్యనారాయణ, మాదాసు వెంకన్న, కాశెట్టి సదానందం, పీఏసీఎస్ డైరెక్టర్ గుండా చంద్రమోహన్, తోట బాబు, గుండా రవి, మహేశ్, మజ్జారి రంగారావు, మేడిపల్లి కుమారస్వామి, శోభన్‌రాజు, నాగరాజు, మంద మహేందర్ పాల్గొన్నారు.

## ధర్మారెడ్డి గెలుపు కోసం పనిచేయాలి

**మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం**



సమావేశంలో మాట్లాడుతున్న చింతం సదానందం

గీసుగొండ, నవంబర్ 4 : అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం కోరారు. గ్రేటర్ 15వ డివిజన్‌లోని మొగిలిచెర్ల, గొర్రెకుంట గ్రామాల్లో శనివారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరకాలను అభివృద్ధి చేసిన నాయకుడిని గెలిపించుకుందామన్నారు. కొత్త వారు గెలిస్తే మనకు వచ్చేది ఏమి ఉండదన్నారు. పైగా అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ దిగజారి పోతోందన్నారు. ఆ పార్టీ నాయకులను నమ్మి మోసపోవద్దని సూచించారు. బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకొని పరకాలను మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రజలంతా బీఆర్ఎస్ వైపు ఉన్నారన్నారు. దేశంలో బీజేపీకి కాలం చెల్లిందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్, కార్పొరేటర్ ఆకులపల్లి మనోహర్, సొసైటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గజ్జి రాజు, అచ్చ మధుకర్, లవ్‌రాజ్, విజయ్ పాల్గొన్నారు.

## నేడు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రచారం

ఆత్మకూరు/దామెర, నవంబర్ 4 : ఆత్మకూరు మండలంలోని మూడు గ్రామాల్లో ఆదివారం పరకాల బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు కటాక్షపురం, రాత్రి 7 గంటలకు హౌసుబుజుర్గు, రాత్రి 8 గంటలకు నీరుకుళ్ల గ్రామాల్లో ప్రచారం చేస్తారని పేర్కొన్నారు. మండలంలోని ముఖ్య నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. అలాగే, దామెర మండలంలో కూడా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఉదయం కోగిల్వాయి, వెంకటాపురం, సింగరాజుపల్లి, ల్యాదెళ్లలో ఎన్నికల ప్రచారం చేస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండు రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రతిమకు డాక్టరేట్



దామెర, నవంబర్ 4 : మండలంలోని ఓగ్లాపురంలోని కేర్ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్, హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన తరునహరి ప్రతిమ డాక్టరేట్(పీహెచ్‌డీ) పట్టా పొందారు. ఆమె రాజస్థాన్‌లోని నెవార్ యూనివర్సిటీలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీలో ప్రొఫెసర్ డాక్టర్ టీ రామ్మోహన్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. కాగా, డాక్టరేట్ అందుకున్న ప్రతిమను కళాశాల యాజమాన్యం, కుటుంబ సభ్యులు, మిత్రులు అభినందించారు.

## '108'లో గర్భిణి ప్రసవం



తల్లి, బిడ్డను దవాఖానకు తరలిస్తున్న 108 సిబ్బంది

దామెర, నవంబర్ 4 : దామెర మండలానికి చెందిన 108 వాహనంలో ఓ గర్భిణి ప్రసవించింది. శుక్రవారం రాత్రి ఆత్మకూరు మండలం నీరుకుళ్ల కందిబండకు చెందిన అర్షం అక్షరకు పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు దామెర 108 వాహనానికి కాల్ చేసి సమాచారం ఇచ్చారు. గర్భిణిని డెలివరీ కోసం వరంగల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో నార్మల్ డెలివరీ జరిగి, ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందిస్తూ హనుమకొండ జీఎంహెచ్‌కు తరలించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి తల్లీబిడ్డ క్షేమంగా ఉండేలా చికిత్స అందించిన 108 సిబ్బంది ఈఎంటీ ఎండీ ఇమ్రాన్‌ఖాన్, పైలట్ టీ సాంబమూర్తిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.